# “నీవు నమ్ముచున్నావా?”

## చదువుటకు నియమించినవి #14

V. రెండవ పస్కానుండి మూడవ దాని వరకు (కొనసాగింది).
   S. యాయీరు కుమార్తెను లేపుట (స్వస్థత నిరుపయోగం) (మత్తయి 9:18–26; మార్కు 5:22–43; లూకా 8:41–56).
   T. గుడ్డివారిని, దయ్యముపట్టిన వానిని బాగుచేయుట (విమర్శకులోనైంది) (మత్తయి 9:27–34).
   U. నజరేతును దర్శించుట (నిరాకరించబడ్డారు) (మత్తయి 13:54–58; మార్కు 6:1–6; లూకా 4:16–31).

క్రీస్తు గలిలయ సముద్రపు పశ్చిమ తీరానికి వచ్చినప్పుడు, జనసమూహము ఆయన కొరకు వేచియుంది (మార్కు 5:21; లూకా 8:40). ఆ సమయంలో, ఒక బాలికను మృతులలోనుండి లేపుటతోపాటు, ఆయన మరికొన్ని గుర్తింపదగిన అద్భుతాలను చేశాడు. దీని అనంతరం, ఆయన గలిలయలో మూడవసారి – నజరేతను తన స్వస్థలం నుండి ప్రారంభించారు.

ఈ పాఠంలో కీలకమైన పదం “విశ్వాసము” లేక “నమ్మిక.”[1] క్రీస్తు ఒక స్త్రీని స్వస్థపరచినప్పుడు, “... నీ విశ్వాసము నిన్ను స్వస్థపరచెను” అని ఆయన చెప్పారు (మత్తయి 9:22). “భయపడకుము, నమ్మిక మాత్రముంచుమని సమాజమందిరపు అధికారితో” ఆయన తెలిపారు (మార్కు 5:36). మిమ్మును బాగుచేయగలనని నమ్ముచున్నారా? అని ఆయన ఆ గుడ్డివారి నడిగారు. “అవును ప్రభువా,” వారు బదులిచ్చినప్పుడు, ఆయన, “– మీ నమ్మిక చొప్పున మీకు కలుగును గాక” అని ఆయన చెప్పారు (మత్తయి 9:28, 29). నజరేతులో ఆయన నిరాకరింపబడినప్పుడు, “ఆయన వారి అవిశ్వాసమునకు ఆశ్చర్యపడెను” (మార్కు 6:6).

ముందుగా ప్రజలు నమ్మికయుంచకపోతే ప్రభువైన యేసు సహితము అద్భుతాలు చేయలేక పోయారని – అద్భుతాలు చేస్తామని చెప్పుకునేవారు ఈ వచనాలను వాడుతారు. వారు స్వస్థపరచలేకపోగా, దానికి సాకుగా, “వారికి తగినంత విశ్వాసము లేదని” చెప్పుకుంటారు. ఈ లేఖన భాగాలలో విశ్వాసము నొక్కి చెప్పబడిన మాట వాస్తవమే అయినా, ప్రభువు చేసిన అద్భుతాలు ఆయన నుండి సహాయం పొందినవారి విశ్వాసం మీదనే అధారపడి ఉన్నాయనేది నిజం కాదు. ఇంతవరకు మనం చదివినవాటిలో, విశ్వాసము సాధ్యముకాని, విశ్వాసములేని అనేక సంఘటనలను మనం చూచాం.[2] ఈ పాఠంలో, చనిపోయిన బాలికను బ్రదికించారు. అంటే, ఆమె పునరుత్థానానికి ముందు ఆమెకు విశ్వాసముండే అవకాశమే లేదు.

అయితే, ఈ సంఘటనలలో విశ్వాసము ఎందుకు నొక్కి చెప్పబడింది? తన

పరిచర్యలో ప్రభువు బహు కీలకమైన ఘట్టానికి వచ్చి చేరుకున్నారు. దీనికి ముందు ఆయన అనేక అద్భుతాలను చేశారు. ఆ అద్భుతాల్లోని ఒక ఉద్దేశం విశ్వాసాన్ని పుట్టించడం (యోహాను 20:30, 31). కొద్ది నెలలలోనే ఆయన ఈ లోకాన్ని విడిచిపోతున్నసంగతి ఆయనకు తెలుసు. ఆయన అలా జరిగించినప్పుడు, భూమి మీద బలీయమైన విశ్వాసాన్ని విడిచివెళ్లనైయున్నారు. అందువలన ఎక్కువ మంది ఆయన యందు విశ్వాస ముంచవలసిందిగా ఆయన కోరుతున్నారు.

ఈ పాఠంలోని ప్రతిభాగంలోను, విశ్వాసానికి అవిశ్వాసానికి మధ్యగల తారతమ్యం సూచింపబడింది. నీవు నేను నమ్ముతున్నామా లేదా అనేది కీలకమైన ప్రశ్నగా ఉంటుంది.

## "యాయీరు, నీవు నమ్ముతున్నావా?"
## (మత్తయి 9:18-26; మార్కు 5:22-43; లూకా 8:41-56)

### విశ్వాసము వ్యక్తపరచబడింది (మత్తయి 9:18, 19; మార్కు 5:22-24; లూకా 8:41, 42)

యాయీరు అను పేరుగలవాడు ప్రభువు వద్దకు వచ్చాడు. అతడు సమాజమందిరపు అధికారియని అంటారు[3] (మార్కు 5:22; లూకా 8:41 చూడు). సమాజమందిరపు అధికారి అంటే, యూదుల "పెద్దల" సభలో ఒకడు (లూకా 7:3 చూడు). సమాజమందిరానికి అతడు బాధ్యుడు.[4] సమాజమందిరపు కార్యకలాపాలు, దానిని క్రమాంగా జరిగించడం (లూకా 13:14 చూడు). చదవడానికి గాని మాట్లాడడానికి గాని ప్రజలను ఆహ్వానించడం (అపొ. 13:15 చూడు).[5] అతని అధ్వర్యంలోనే జరుగుతాయి. యూదుల నగరాల్లో సమాజమందిరపు అధికారి చాలా గౌరవించబడే వ్యక్తియై యుంటాడు.

అయితే యాయీరు క్రీస్తు వద్దకు వచ్చినప్పుడు, అతడు "ఆయన పాదములమీద పడ్డాడు." ఆయనకు "నమస్కరించాడు (ఆయనకు మ్రొక్కి)," తన పన్నెండేండ్ల కుమార్తె "చావసిద్ధముగా నున్నది." ఆయన వచ్చి ఆమెను బాగుచేయునట్లు ఆయనను వేడుకొన్నాడు (మార్కు 5:22; మత్తయి 9:18; మార్కు 5:23).[6] కపెర్నహూములో రాజ్యపు అధికారి కుమారుని ఆయన స్వస్థపరచిన సంగతిని అతడు వినియుండవచ్చు[7] (యోహాను 4:46-53). మరియు ఆ పట్టణంలో ఒక శతాధిపతియొక్క సేవకుని సహితము బాగుచేసిన సంగతి అతడు వినియుండవచ్చు (లూకా 7:1-10). తన హోదాను ప్రక్కను పెట్టి, అతడు ప్రభువు యొక్క పాదాలమీద పడి, తన ఏకైక కుమార్తెకు సహాయం చేయుమని ఆయనను వేడుకున్నాడు (లూకా 8:42). "అతని అవసరతలు తన అతిశయముకంటె అధికమించినవైయున్నాయి" అని J. W. McGarvey అన్నాడు.[8] నీకు పిల్లలున్నారా? అయితే, యాయీరు హృదయంలోని వేదన నీకు అర్థమౌతుంది.

ప్రభువు వెనుకాడలేదు. ఆ అధికారితో కూడ, అతని యింటికి వెళ్లసాగారు.

జనసమూహాలలో గుండ వారు నెట్టుకుని వెళ్లవలసి వచ్చింది గనుక వారు నెమ్మదిగానే దాటవలసివచ్చినట్టు Living Bible అంటుది (లూకా 8:24; మార్కు 5:24, 31ని కూడా చూడు).

### విశ్వాసం పరీక్షింపబడింది (మత్తయి 9:20-22; మార్కు 5:25-36; లూకా 8:43-50)

యాయీరు యింటికి ఆయన వెళ్లుతుండగా, అసాధారణమైన సంఘటన ఒకటి జరిగింది. దీనిని "బ్రాకెట్లలోని అద్భుతం" అని అంటారు. ఎందుకంటె, మరొక అద్భుతం జరుగబోయే సందర్భంలో యిది దానికి అతుకబడింది.

ఆ జన సమూహములలో గుండ ప్రభువు వెళ్లుచుండగా, ఆ జనంలో గుండా దూరుకొంటూ క్రీస్తును చేరడానికి తీర్మానించుకున్న ఒక స్త్రీ ఆయనను సమీపించింది. రక్తస్రావంతో పన్నెండు సంవత్సరాలుగా ఆమె బాధపడుతున్నట్టు వైద్యుడైన లూకా గుర్తించాడు. ఆమె ఎన్ని ప్రయత్నాలు చేసినా స్వస్థపడలేదట (లూకా 8:43). మోషే ధర్మశాస్త్రానిబట్టి ఆమె నిరంతరం అపవిత్రురాలుగానే ఉండిపోయింది (లేవీ. 15:19, 26 చూడు).[9]

మార్కు ఈ విషయాన్ని మరింత తేటగా మాట్లాడినట్టున్నాడు: "ఆమె అనేక వైద్యులచేత ఎన్నో తిప్పలుపడి తనకు కలిగినదంతయు వ్యయము చేసికొని, యెంత మాత్రమును ప్రయోజనములేక మరింత సంకటపడెను" (మార్కు 5:25బి, 26). ఆ దినాల్లో, అనేక మంది వైద్యులు "కొంచెం" ప్రాథమిక వైద్యము,[10] "కొంచెం" వనమూలికలు, మరికొందరి మూఢ నమ్మకాలతో కూడిన కర్మకాండను[11] వినియోగించేవారు.

సంవత్సరాల తరబడి జబ్బుతో ఉన్నవారెవరైనా నీకు తెలిసియున్నట్టయితే, ఈ స్త్రీ ఎట్టిబాధను అనుభవించిందో నీవు ఊహించగలవు. ఆమె పాలిపోయి, నిస్సత్తువగా, ఎక్కువైన బాధతో ఉండియుండవచ్చు. అయినా, ప్రభువు ఆ మార్గాన వస్తున్నట్టు ఆమె వినినప్పుడు, ఎక్కడలేని ఓపిక తెచ్చుకొంది: ఆమె నేరుగా ఆయన వెనుకకు చేరేవరకు ఆ జన సమూహంలోంచి తప్పుకుని ఆయనను తాకేంత సమీపానికి చేరింది.

"నేను ఆయన పై వస్త్రము మాత్రము ముట్టితే బాగుపడుదునని తనలో తాను" అనుకొన్నది (మత్తయి 9:21; మార్కు 5:28). అద్భుతములు చేయు శక్తిగల వ్యక్తి ముట్టిన వస్తువులలో అద్భుత శక్తి ఉంటుందని సాధారణ నమ్మకం ఒకటుంది (మత్తయి 14:36; అపొ. 19:11, 12). ప్రభువును తొందరపెట్టడం మర్యాదగా ఉండదని, ఆమె ఆయన వస్త్రపు చెంగును ముట్టడానికి మాత్రమే తీర్మానించుకుంది. ఆమె ఆలోచన ఏమైయున్నా, క్రీస్తు శక్తియందు ఆమెకు విశ్వాసముంది.

ఆమె తన చెయ్యిచాచి, ఆయన వస్త్రపుచెంగును ముట్టుకొంది (మత్తయి 9:20).[12] ఆమె అలా చేసినప్పుడు, "వెంటనే ఆమె రక్తధార కట్టెను గనుక తన శరీరములోని బాధ నివారణయైనదని గ్రహించుకొనెను" (మార్కు 5:29). జబ్బుగా ఉంటే బాగులేనట్టును, జబ్బు తగ్గిపోతే బాగున్నట్టును సహజంగా తలంచుతూ ఉంటాం. ఆమె దేహానికి

బలంరావడం, పాలిపోయిన ఆమె దేహానికి సహజ వన్నె రావడం, ఆమె మోములో నవ్వు వికసించడం నేను ఊహించగలను.

తనలోనుండి శక్తి బయటకు వెడలిందని ప్రభువుకు వెంటనే తెలిసిపోయింది (మార్కు 5:30ఎ; లూకా 8:46). నేను యిక్కడ బాగుచేయదలచుకోలేదు. అల్ప మానవుడిగా, నేను దైవ శక్తిని గ్రహించలేను – ఈ వివరాలు నన్ను ముగ్ధునిగా చేస్తున్నాయి. నేను లేనిది చెప్పుతున్నానేమో కాని, అద్భుతాలు చేయడానికి క్రీస్తుకు కొంత వ్యయం అవుతుందేమోననిపిస్తుంది. ఆయన చేసిన ప్రతి అద్భుతంలోను ఆయన నుండి కొంత ప్రభావం పోయిందేమోననిపిస్తుంది.[13] అయితే ఆయన ఆ వ్యయాన్ని గూర్చి ఎన్నడు తలంచినట్టు లేదు. ఇతరులను సంధించడానికి ఆయన ఎన్నడూ వెనుకాడలేదు.

తనలోనుండి శక్తిపోయినట్టు ఆయన భావించినప్పుడు, ఆయన అక్కడ నిలిచి, "నా వస్త్రములు ముట్టిన దెవరని" అడిగారు (మార్కు 5:30బి). అది తన శిష్యులను ఆశ్చర్యపరచింది. "ఆయన శిష్యులు – జన సమూహము మీద పడుచుండుట చూచుచున్నావే, నన్ను ముట్టిన దెవడని అడుగుచున్నావా?" అనిరి (మార్కు 5:31). అది మనలను కూడ కొంత తబ్బిబ్బుచేస్తుంది. ఆ స్త్రీ ఎవరో తనకు తెలియదని దాని భావమా? ఆ స్త్రీ ఎవరో, ఆమె ఏమిచేసిందో, అలా ఎందుకు చేసిందో ప్రభువు ఎరుగునని మత్తయి మార్కుల వివరణలో సూచితమై ఉంది. ఏ విధమైన సంశయము, సంకోచము లేక ప్రభువు ఆ స్త్రీని చూచినట్టు వారు సూచిస్తున్నారు (మత్తయి 9:22; మార్కు 5:32).

ప్రభువు అలా ప్రశ్నించడంలో సమాచారాన్ని సేకరించాలని ఆయన ఉద్దేశం కాదు, కాని ఉన్న లేక జరిగిన వాస్తవాలను సత్యాలను యితరుల మనస్సుల్లో నాటించడమై యుంది.[14] ఈ సందర్భంలో అదే సంగతి జరిగియుండవచ్చు. ఆ స్త్రీ విశ్వాసమెట్టిదో తన చుట్టునున్నవారు గుర్తించాలని ఆయన అలా చేసియుండవచ్చు. ఆమె విశ్వాసం ఆమెకు ఎలా స్వస్థత కలిగించిందో, ఎలా తన జీవితాన్ని దీవించిందో అది చూపుతుంది. ఏమి సంభవించిందో అది ఎందుకు సంభవించిందో మంచి అవగాహన ఆమెకు కలగాలని ఆయన కోరియుండవచ్చు. లూకా యిలా వ్రాశాడు:

> తాను మరుగైయుండలేదని, ఆ స్త్రీ చూచి, వణకుచు[15] వచ్చి ఆయన యెదుట సాగిలపడి తాను ఎందు నిమిత్తము ఆయనను ముట్టెనో, వెంటనే తాను ఏలాగు స్వస్థపడెనో ఆ సంగతి ప్రజలందరియెదుట తెలియజెప్పెను. అందుకాయన "నా కుమారీ, నీ విశ్వాసము నిన్ను స్వస్థపరచెను, సమాధానము గలదానవైపొమ్మని ఆమెతో చెప్పెను" (లూకా 8:47, 48).

"సమాధానము గలదానవై పొమ్మని" దీవించడంలో, ఆమె పొందిన స్వస్థత స్థిరమైనదని ఆ రోగము తిరిగి రాదనే అభయాన్ని ప్రసాదిస్తుంది.

ఆ స్త్రీ వెళ్లడాన్ని – తిరిగి దృష్టి యాయీరు మీదికి మళ్లడాన్ని చిత్రించి చూడు. త్వరగా యేసును తన యింటికి తోడుకొని పోవాలనే అతురతలో యాయీరు ఉన్నాడు. తన కుమార్తె తన యింటివద్ద ప్రాణంపోయే స్థితిలో ఉంది. అతడు ఆ జనసమూహాలోంచి వెళ్లుతుండగా, ఈ ప్రార్థనను అతడు మరల మరల నిశ్శబ్దంగా చెప్పియుండవచ్చు:

“ఎక్కువ ఆలస్యం కాకుండ మాకు సహాయం చేయండి దేవా, ఆమె చావకమునుపు మేము అక్కడికి వెళ్లేలా సహాయపడడండి!” ఇప్పుడు ఆయన ఆగిపోవలసి వచ్చింది. అందులో ఆ స్త్రీ విషయం పరిష్కారం చేయవలసి వచ్చింది. నేనే యాయీరునై యుండినట్ట యితే, “యేసూ, ఆమెకు తరువాత సహాయము చేయవచ్చు! ఆమె పన్నెండేండ్లనుండి రోగిగా ఉంది. ఇంకా ఒకటి రెండు రోజులు ఆగినా ఫరవాలేదు. చిన్నదైన నా కుమార్తెకు నీవు యిప్పుడు అవసరం!” అని కేక వేసేవాడినే.

ఆ ఆలస్యమును బట్టి ఆ అధికారి విసుగుచెందిన్నట్టయితే, ఆ విసుగు నిరాశగా మారి పోయేదే. ఎందుకంటే, “ఆయన ఇంకను మాటలాడుచుండగా సమాజమందిరపు అధికారి యింటనుండి ఒకడు వచ్చి–నీ కుమార్తె చనిపోయినది, బోధకుని శ్రమపెట్టవద్దని అతనితో చెప్పెను” (లూకా 8:49బి). ఆ మాటతో అతని హృదయం లోపల కృషించిపోయేదే. నేనేమంటున్నానో మిలో కొందరికి తెలుసు.

యాయీరు నిరాశ క్రీస్తు ఎరిగియుండేవాడే. ఆయన అతనితో నెమ్మదిగా యిలా అన్నారు: “భయపడవద్దు, నమ్మిక మాత్రముంచుము, ఆమె స్వస్థపరచబడునని”[16] (లూకా 8:50; మార్కు 5:36 చూడు). అది ఎంతటి విశ్వాసపు పరీక్షయైయుంది!

### విశ్వాసం బహుమానం పొందింది (మత్తయి 9:23–26; మార్కు 5:37–43; లూకా 8:51–56)

ప్రభువు యాయీరుతో అతని యింటికి వెళ్లారు. వారు ఆ యింటికి వచ్చినప్పుడు, అతని కుమార్తె చనిపోయి కొద్దిసేపే అయినప్పటికి, సమాధి సన్నాహాలు అప్పుడే మొదలయ్యాయి. ఆ దినాల్లో ఆ జనుల మధ్య సమాధి ఆ దినానే చేయడం వాడుక. కుటుంబానికున్న సామాజిక అంతస్థునుబట్టి ఏడ్చువారి సంఖ్య, దానికి సంబంధించిన అల్లరి ఎక్కువగా ఉంటుంది.[17] ఆలాగున ఆ అధికారి యింట ప్రవేశించినప్పుడు, “వారు గొల్లున యేడ్చుచు, ప్రలాపించుచునుండుట చూచారు” (మార్కు 5:38; మత్తయి 9:23). “పిల్లన గ్రోవి ఊదువారి” విషాదకరమైన ధ్వని వినిపిస్తుంది (మత్తయి 9:23).

ఆ దినాన ఆయన చేయవలసిన కష్టమైన పని – తన మాట వినబడేలా వారందరిని శాంతపరచడమై యుండవచ్చు. వారాయన మాటలపై శ్రద్ధ ఉంచినప్పుడు, “ఏడ్చుట మాని,” “తొలిగిపొండి” అన్నట్టు ఆయన చెప్పారు. “– ఏడ్వవద్దు, ఆమె నిద్రించుచున్నదే గాని చనిపోలేదని చెప్పెను”[18] (లూకా 8:52; మత్తయి 9:24; మార్కు 5:39). ఆయన ఆ మాటలు చెప్పునప్పుడు, ఏడ్చుచున్న ఆ యిల్లు నవ్వులతో కదిలిపోయింది (మత్తయి 9:24; మార్కు 5:40).[19] లూకా యిలా వర్ణించాడు: “ఆమె చనిపోయెనదని వారెరిగి ఆయనను అపహసించిరి” (లూకా 8:53). అందులో కూలికి ఏడ్చేవారి అపహాస్యాన్ని మనం ఊహించవచ్చు: “అది హాస్యాస్పదం! ఈ సంవత్సరం యాభైయవ సమాధి కార్యకలాపాలకు వెళ్ళాను, చనిపోయినవాడు ఎలా ఉంటాడోనేను ఎరుగుదును.”

పరిహాసకులను, అవిశ్వాసులను ద్వారం వెలుపలనుంచి, యాయీరును అతని భార్యను, తన శిష్యులలో – పేతురు, యాకోబు, యోహానులను తోడుకొని ఆయన లోపలికి వెళ్లారు

(మార్కు 5:37) – అంటే అ చిన్నదాని దేహం ఉంచిన గదిలోనికి ప్రవేశించారు. శిష్యులలో వీరి ముగ్గురిని ప్రత్యేకించి చూపించిన మూడింటిలో యిది మొదటి సంఘటన.[20]

ఈ చిత్ర దృశ్యాన్ని నీ మనస్సులో చిత్రించుకో: క్రీస్తు ప్రభువు ప్రాణంలేని ఆ పిల్ల దేహాన్ని సమీపించి ఆమె చేయి పట్టుకున్నాడు, అప్పటికే ఆ బిడ్డ చనిపోయి చల్లబడి పోయింది. "తలీతాకుమీ" అని నెమ్మదిగా పలికారు – ఈ అరామి మాటకు – "చిన్నదానా, లెమ్మని నీతో చెప్పుచున్నాను" అని అర్థం (మార్కు 5:41). నిద్రిస్తున్న చిన్న బిడ్డను ఉదయకాలం లేపడానికి తగిన మాటలులా అవి ఉన్నాయి.[21]

వెంటనే, "ఆమె ప్రాణము తిరిగివచ్చెను" (లూకా 8:55).[22] కండ్లు రెపరెపకొట్టి ఆమె తెరచినట్టు నీవు చూడగలవా? అమె తల్లిదండ్రుల శ్వాసలు నీవు వినగలవా? "వెంటనే ఆ చిన్నది లేచి నడవసాగెను"[23] అని దాఖలు చేశాడు (మార్కు 5:42). తన తల్లిదండ్రుల చేతులలోనికి ఆమె పరుగెత్తుట నీవు చూడగలవా? ఆమె కొరకు భోజనం సిద్ధపరచుకొని సంతోషంగా ఉన్న ఆమె తల్లికి ప్రభువు చెప్పుటను నీవు చిత్రించుకో గలవా? (మార్కు 5:43; లూకా 8:55)?[24]

తనపై పరిసయ్యులు శత్రుత్వాన్ని పెంచుకొంటున్నందున, దీన్ని బయటికి చెప్పవద్దని ప్రభువు కోరారు. "జరిగినది ఎవనికి తెలియకూడదని ఆయన వారికి గట్టిగా ఆజ్ఞాపించారు" (మార్కు 5:43; లూకా 8:56 చూడు). – అయితే, "ఈ సమాచారము ఆ దేశమంతటను వ్యాపిం"చడానికి ఎక్కువ సమయం పట్టలేదు (మత్తయి 9:26).

నేను నీకీయదగిన దృశ్యమేమిటంటే, సంతోషముతో ఉప్పొంగుచున్న తల్లి, ఆనందముతో చూచుచున్న తండ్రి ఎదుట కుమార్తెను తినమని బతిమాలుచున్నది. నీవు ఆ వ్యక్తిని కనుక "యాయీరు, నీవు నమ్ముతున్నావా?" "అడుగవలసినట్లయితే," "అవును!" అన్న జవాబు ప్రతిధ్వనిస్తుంది.

## "గుడ్డివారలారా, మీరు నమ్ముతున్నారా?"
## (మత్తయి 9:27-34)

### నేత్రములు లేనివారి విశ్వాసం (27–31 వచనాలు)

ప్రభువు యాయీరు యింటిని విడిచివెళ్లుచుండగా, యిద్దరు గుడ్డివారు ఆయన వెంటపడి "దావీదు కుమారుడా, మమ్మును కనికరించుమని కేకలువేసిరి" అని మత్తయి రికార్డు చేశాడు[25](27 వ.). ఆయన బసచేస్తున్న యింటివరకును వారాయనను వెంబడించారు (28ఎ వ.). చివరికి, ప్రభువు వారివైపు తిరిగి, "నేను ఇది చేయగలనని మీరు నమ్ముచున్నారా అని అడుగగా, వారు – నమ్ముచున్నాము ప్రభువా అని ఆయనతో చెప్పిరి. అప్పుడాయన వారి కన్నులు ముట్టి[26] – మీ నమ్మకము చొప్పున మీకు కలుగును గాక అని చెప్పినంతలో వారి కన్నులు తెరువబడెను." (మత్తయి 9:28–30ఎ). ఎవరికిని చెప్పవద్దని మరోసారి వారికి తెలిపారు (30బి వ.). మరోసారి – ఆ సంగతి అంతటను వ్యాపించింది (31 వ.).

**ఆత్మ సంబంధమైన గుడ్డివారి అవిశ్వాసము (32-34 వచనాలు)**

క్రీస్తు యింటిలోనుండి రాగా, వెంటనే జనసమూహాలు ఆయన చుట్టు మూగాయి. ఆయన బోధించడం, బాగాచేయడమనే కార్యక్రమాన్ని తిరిగి ఆరంభించారు. దయ్యముపట్టి మాటలాడలేని[27] వ్యక్తి ఆయన వద్దకు తేబడ్డాడు (32 వ.) ప్రభువు ఆ దయ్యమును వెళ్లగొట్టగా అతడు మాట్లాడసాగాడు. "జనసమూహములు ఆశ్చర్యపడి – ఇశ్రాయేలులో ఈలాగు ఎన్నడును కనబడలేదని చెప్పుకొనిరి" (33 వ.).

మామూలుగానే, ప్రభువుని విమర్శించేవారు కూడా అక్కడ ఉన్నారు. "ఇతడు దయ్యముల అధిపతివలన దయ్యములను వెళ్లగొట్టుచున్నాడని" వారు అన్నారు (34 వ.).[28] పరపక్షద్వేషం వారి చెవులను మూసింది, వారి హృదయాలకు అంధత్వం కలుగజేసింది (మత్తయి 13:15). క్రీస్తు ఏమి జరిగించినా సరే, వారు నమ్మి నిరాకరించారు.

## "నజరేతు పౌరులారా, మీరు నమ్ముతున్నారా?"

## (మత్తయి 13:54-58; మార్కు 6:1-6; లూకా 4:16-30)

యాయీరు కుమార్తెను బ్రతికించిన కొద్దికాలానికే (మార్కు 5:37–43), ఆయన తన స్వస్థలమైన నజరేతుకు వెళ్లారు (మార్కు 6:1). గలిలయలోని ఆయన మూడవ ప్రయాణానికి యిది తొలి విడిదియై యుండవచ్చు[29] (మార్కు 6:6; మత్తయి 9:35).

తన వర్ణనలో క్రీస్తు నజరేతులో నిరాకరింపబడినట్టు, లూకా ముందుగా వ్రాశాడు. ప్రభువు యొక్క గలిలయ పరిచర్యకు నజరేతుకాక, కపెర్నహోము ప్రధాన కేంద్రంగా ఎందుకు ఉపయోగింపబడిందో యిది తెలియజేస్తుంది (లూకా 4:16–31 చూడు). నజరేతులో ప్రభువు రెండు మార్లు నిరాకరింపబడినట్టు యిందును బట్టి చాలా మంది రచయితలు ఒప్పించబడ్డారు: మొదట ఆయన గలిలయ పరిచర్య ఆరంభంలో, తరువాత ఆ పరిచర్య చివరి భాగంలో కూడా. అది అలా జరిగియుండవచ్చుకాని,[30] నాకైతే మత్తయి, మార్కు రచనలు లూకా రచనకు వంత పలుకుతున్నట్టున్నాయి: ప్రతిదానిలోను, యేసు సమాజమందిరమునకు వెళ్లి అక్కడ బోధించనారంభించారు (మత్తయి 13:54; మార్కు 6:2; లూకా 4:16–21). ప్రతిదానిలోను, ప్రజలు తొలుత ఆయన మాటలతో ఒప్పింపబడినట్టున్నారు (మత్తయి 13:54; మార్కు 6:2; లూకా 4:22). అటు తరువాత "స్థానికుడనే" భావంతో వారు అభ్యంతరపడినట్టున్నారు (మత్తయి 13:55–57; మార్కు 6:3, 4; లూకా 4:22). లూకా యివ్వని వివరాలను మత్తయి మార్కులు యిచ్చిన మాట వాస్తవమే. మత్తయి మార్కుల్లో కనబడని సందేశాన్ని లూకా యిస్తాడు. అయినా ఈ వివరాలు పరస్పర విరుద్ధాలుకాక, ఒకదాని నొకటి బలపరచుకొనేవిగా ఉన్నాయి.[31]

ఏమైనాసరే, ఆ మూడు వర్ణనలు కావలసినంత ఏకరీతిగా ఉన్నాయి; ప్రయోజనకరంగా వాటిని చదవవచ్చు. ఈ సంఘటన దీని వెంట వచ్చే ప్రసంగంలో చర్చించబడింది, అయితే ప్రస్తుతం కొన్ని మాటలు – ప్రత్యేకించి ఈ అంశానికి సంబంధించిన ముఖ్యమైన వాటిని చూద్దాం.

**విశ్వాసం సాధ్యం (మత్తయి 13:54; మార్కు 6:1, 2; లూకా 4:16–22)**

ఆయన పెదిగిన నజరేతుకు తిరిగివచ్చి, సమాజమందిరపు కూడికకు ఆయన హాజరౌతారు.[32] దానిలో పాలుపొందడానికి ఆయనకు అవకాశమియ్యబడినప్పుడు, రాబోయే మెస్సీయాను గూర్చిన గొప్ప ప్రవచన భాగాన్ని, యెషయా 61 నుండి చదివి వినిపిస్తారు. అప్పుడాయన, "– నేడు మీ వినికిడిలో ఈ లేఖనము నెరవేరినదని వారితో చెప్పసాగెను" (లూకా 4:21). అంటే, ప్రవక్తయైన యెషయా మాట్లాడినది తనను గూర్చియేనని ఆయన సూచించారు.

**విశ్వాసము నిరాకరించబడింది (మత్తయి 13:54–58; మార్కు 6:2–6; లూకా 4:22–30)**

దానికి మిశ్రిత స్పందన వచ్చింది. ఆయన శ్రోతలు గర్విష్టులైయున్నారు. స్థానికుడు అంత గొప్పగా చెప్పుకొనడం వారికి నచ్చలేదు. అలా చెప్పుకొనడం వారికి కోపం రేపింది. "ఇతడు చిన్నవాడైయుండగా, నా పిల్లలతో ఆటలాడాడు! తన్ను గూర్చి తానేమను కుంటున్నాడు?" అని వారు అనుకునే సంగతులు ఊహించడానికి కష్టమైనవి కావు. "ఆయన విషయమై వారు అభ్యంతరపడిరి" (మత్తయి 13:57). The New Century Versionలో[33] "యేసు విషయమై వారు తారుమారయ్యారు" అని ఉంది.

రమారమి పదహారు మైళ్ల దూరంలో ఉన్న కపెర్నహూములో ఆయన ఆశ్చర్యమైన కార్యాలు జరిగించారు. వారికి భ్రమింపజేసే గొప్పకార్యాలు చేయుమని వారు కోరుతున్నారు (లూకా 4:23). పరిసయ్యులు కోరినట్టే, ఒక "సూచక క్రియ" చేయుమని వారడుగు తున్నారు (మత్తయి 12:38–42). వారి కోరిక విశ్వాసానికి కాక, అవిశ్వాసానికే సూచనయైయుంది. క్రీస్తు నజరేతులో కొన్ని అద్భుతములను చేశారు. "కొందరి రోగులపై ఆయన చేతులుంచి వారిని ఆయన స్వస్థపరిచారు" (మార్కు 6:5)[34] – "కాని వారి అవిశ్వాసాన్ని బట్టి అక్కడ ఆయన అనేకములైన అద్భుతాలు చేయలేదు" (మత్తయి 13:58).

అక్కడి ప్రజలు తన ప్రాణాన్నే తీయజూచినప్పుడు – "ప్రవక్త తన దేశములోను తన ఇంటను తప్ప మరి ఎక్కడైనను ఘనహీనుడుకాడని వారితో చెప్పెను" (మత్తయి 13:57; మత్తయి 6:4; యోహాను 4:44 చూడు). ఆయన ఆ ప్రజలనెరుగు. ఆయన వారిలో అనేకులతో పెరిగారు, వారితో జీవించారు, వారితో పని చేశారు, వారికి సహాయం చేశారు. ఆయన వారిని ప్రేమించారు. తనయందు విశ్వాసముంచ నిరాకరించినందుకు ఆయన హృదయం పగిలియుండాలి. "ఆయన వారి అవిశ్వాసమునకు ఆశ్చర్యపడెను" అని (Living Bible) అంటుంది.

## ముగింపు

ఒకవైపు మనం యాయీరు విశ్వాసము, రక్తస్రావముగల స్త్రీ విశ్వాసము, యిద్దరు గుడ్డివారి విశ్వాసము చూచాం. మరోవైపు, యాయీరు యింట ప్రలాపించే వారి అవిశ్వాసము, పరిసయ్యుల అవిశ్వాసము, నజరేతు పౌరుల అవిశ్వాసాన్ని చూచాం.

"మనము యేసునందు నిజంగా విశ్వాసముంచుతున్నామా?" అనే దానికంటె ముఖ్యమైన ప్రశ్న జీవితానికి లేదు. విశ్వసింపకుంటే, ప్రభువు మన జీవితాలను ఆశీర్వదించడు (మార్కు 6:5 చూడు). క్రీస్తును గూర్చి మనం చదివేకొలది, ఆయనయందు నీ విశ్వాసము ఎదుగవలెననునది నా ప్రార్థనయైయుంది (యోహాను 20:30, 31; రోమా 10:17).

---

సూచనలు

[1]అదే గ్రీకు పదం కొన్నిసార్లు "విశ్వాసమని" మరికొన్ని సార్లు "నమ్మకమని" తర్జుమా చేయబడింది. [2]ఈ చర్చను "క్రీస్తు జీవితం, భాగం 2లో" "వారందరు విభ్రాంతినొంది దేవుని మహిమపరచిరి" అనే పాఠం చూడు. [3]"సమాజమందిరపు అధికారి" అనేది "సమాజ మందిరముపై నుండువారు" అనేది అక్షరార్థం. [4]"పెద్ద" అని సువార్త రచనల్లో కన్పించేది "పితరుడు" అని అర్థం (మత్తయి 15:2), అయితే జీవించుతున్న యూదుల నాయకుని అది సూచిస్తుంది. యూదా మత ఉద్యోగుల క్రమంలో సమాజమందిరపు అధికారి శాస్త్రుల క్రింద లెక్కింపబడినవాడు. "పెద్ద" అనేది సాధారణంగా మతనాయకులకు ఉపయోగింపబడింది. "పెద్దలచేతను ప్రధాన యాజకుల చేతను శాస్త్రుల చేతను" అనేక హింసలుపొందినట్టు చెప్పబడింది (మత్తయి 16:21; 21:23 చూడు). కొన్ని సార్లు సన్‌హెడ్రిన్ "పెద్దల సమావేశమని" పిలువబడింది (లూకా 22:66). [5]సమాజమందిరపు తక్కువ అధికారిని "పరిచారకుడన్నారు" (లూకా 4:20). [6]మత్తయి రచనలో యాయీరు కుమార్తె "యిప్పుడే చనిపోయినది" అని అతడు అన్నాడు (మత్తయి 9:18). "ఆమె చనిపోవుచున్నదని" వైద్యుడైన లూకా అన్నాడు (లూకా 8:42). [7]యేసు కపెర్నహూముకు తిరిగివచ్చియుండవచ్చు. "ఈయన ఎవరో?" అనే పాఠమును చర్చించు. [8]J. W. McGarvey and Philip Y. Pendleton, *The Four Gospel or A Harmony of the Four Gospels* (Cincinnati: Standard Publishing Co., 1914), 352. [9]"పవిత్రము" "అపవిత్రము" అనే వాటికి సంబంధించిన చట్టాలు జబ్బు వ్యాపింపకుండనట్టు చేయబడినవై యున్నాయి. [10]physiology అంటే "జీవుల శీరీరశాస్త్రం." – మొదటి శతాబ్దంలో జీవుల అవయవాలు పనిచేసే తీరును గూర్చిన జ్ఞానం బహు ప్రాథమికమైనది.

[11]ప్రాచీన వైద్యశాస్త్ర పద్ధతులను గూర్చి "ప్రకటన, 2లో" (ఆంగ్ల సంచికలో, ట్రూత్ ఫర్ టుడే; మార్చి 1999): 38 చూడు. [12]"వస్త్రపు చెంగు"ను ముట్టడమనేది సాధారణమైన వాడుకలోనికి వచ్చింది."బట్ట నాలుగు చెంగులకు" అల్లిక చేసికొనవలెను (ద్వితీయో. 22:12). [13]అప్పుడప్పుడు ఆయనకు ఎందుకు విరామం కావాలో, ప్రార్థన ఆయనకు ఎందుకు ముఖ్యమో వివరించడానికి యిది సహాయపడవచ్చు. [14]దీనికి ఒక ఉదాహరణ యోహాను 6:5, 6లో ఉంది. [15]ఆమె ఎవరిని ముట్టినా వారు అపవిత్రులౌతారు (లేవీ. 15:19). గనుక ఆమె అందుకు వణకుతూ ఉండవచ్చు. రబ్బీలైతే ఆమెను గద్దించియుండేవారుకాని ప్రభువు అలా చేయలేదు. [16]ఆ బాలిక రోగియైయుంటే "స్వస్థపరచబడడమనేది" తగిన పద ప్రయోగమై యుండేది. మృతులను లేపడమనేది రోగులను బాగుచేయడంగానే లెక్క కట్టబడింది. గనుక నేడు రోగాలను బాగుచేసేవాడు చచ్చిన వారిని సయితం లేపగలగాలని నేను నొక్కి చెప్పుతున్నా. [17]పేదలకైనా ఒక ఏడ్చే స్త్రీ ఉండవలసియుంది. [18]మరణానికి "నిద్రించుట" అనేది ఒక విధమైన ప్రయోగం (యోహాను 11:11–14). "సమాధుల దొడ్డి" అంటే అక్షరార్థం "నిద్రించే స్థలం." [19]ప్రభువుని హేళనచేయడం అపహాస్యం చేయడం – చనిపోయిన చిన్న దానిని ఆయన బ్రతికించలేడని అయ్యుండవచ్చు లేక విలపించువారు, పిల్లనగ్రోవి ఊదు వగైరాలకు కూలి లభించదనే భయం కావచ్చు. [20]మిగిలిన రెండు సందర్భాలు రూపాంతరపు కొండ, గెత్సమనే తోట (మత్తయి 17:1; మార్కు 14:33). అయన వారినే ఎందుకు తోడుకొని పోయేవారు? మనకు తెలియదు … తనయందు విశ్వాసముంచిన మొదటి వారిలో వీరున్నారు.

[21]ఈ ప్రయోగం McGarvey and Pendleton, 356 నుండి సేకరింపబడింది. [22]మృతులలోనుండి ప్రభువు లేపిన వారిలో యిది రెండో రికార్డు. మొదటిది నాయీనులో విధవరాలి కుమారుని బ్రదికించడం (లూకా 7). మూడవది లాజరును బ్రదికించడం (యోహాను 11). [23]పిల్లలను ఎరిగిన మనం, ఆమె కొంత విడిచిపెట్టి ఉండొచ్చు. [24]ఆమె రోగియైనప్పుడు, ఆకలి కొంత కోల్పోయి ఉండవచ్చు. ఆపైన ఆమె కొంత కాలం తిండే తినకుండ ఉండియుండవచ్చు. మనకు మనం చేసుకోగలిగిన వాటిని దేవుడు మనకొరకు చేయడు అనడానికి యిది ఊదాహరణకావచ్చు. [25]"దావీదు కుమారుడు" మెస్సీయా యొక్క బిరుదైయుంది (2 సమూ. 7:12). [26]తాను స్వస్థపరచినవారిని ప్రభువు కొన్నిసార్లు ముట్టాడు. కొన్నిసార్లు ముట్టలేదు, శక్తి వ్యక్తిలో ఉందిగాని, విధానంలో లేదు. [27]మాటలాడలేకున్నందున అతనికి చెవుడు

వచ్చియుండవచ్చు. అతని మూగతనం దయ్యం పట్టినందున ఏర్పడింది (మార్కు 9:17 చూడు). [28]ఈ దోషారోపణకు ప్రభువు సమాధానం "ఈ సంచికలోను," మరియు "యజమానుని కలిసికో" లో చూడు. [29]వచ్చే పాఠంలో మూడవ ప్రయాణం గురించి చదువుదాం. [30]యేసు నజరేతుకు వచ్చి వారికి రెండవ అవకాశం యివ్వడం – దయగల ఆయన స్వభావంతో పూర్తిగా ఏకీభవిస్తుంది.

[31]లూకా 4:16–30ని నేను యిక్కడ ఎందుకు చేర్చానో "క్రీస్తు జీవితం, భాగం 2లో" "ఉత్తరమున నున్న గలిలయకు" అనే పాఠంలోని 19వ సూచనను చూడు. [32]ఈ సమయం వరకు సమాజమందిరపు పరిచర్యను గూర్చి లూకా సంపూర్తిగా 1 వర్ణించాడు. కొన్ని సంవత్సరాల తరువాత రాయబడిన దైవ ప్రేరేపితం కాని రచనల నుండి సినగొగు పరిచర్యలను గూర్చి తెలుసుకోవచ్చు. [33]జవాబు (Dallas: Word Bibles, 1993), 980. [34]"కొద్దిమంది రోగులమీద చేతులుంచి వారిని స్వస్థపరచుట తప్ప మరి ఏ అద్భుతమును ఆయన అక్కడ చేయజాలక పోయెను" (మార్కు 6:5). దేవుడు (లేక క్రీస్తు) ఏదైనా చేయలేక పోయినట్టు బైబిలు చెప్పిదంటే, "అలా చేయడం ఆయన చిత్తానికి అనుకూలం కాదని" దాని అర్థం.